క్లుప్తంగా

వైద్యశిబిరానికి విశేష స్పందన



కమలాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ఎస్‌జే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా హనుమకొండకు చెందిన వైద్య నిపుణులు లావణ్య (కార్డియాలజిస్ట్), డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్ (క్రిటికల్ కేర్ యూనిట్), డాక్టర్ అనూష (గైనకాలజిస్ట్), డాక్టర్ నరేష్, డాక్టర్ భక్తావర్ రజీ (ఈఎన్‌టీ సర్జన్), డాక్టర్ రహమాన్ ఖాన్ (లాప్రోస్కోపిక్ సర్జన్) తదితరులు సుమారు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలవారి జతిన్, వైద్య సిబ్బంది రాణి, సంధ్య, కుమారస్వామి, ఆసిఫ్ ఇక్బాల్ టీం, గ్రామస్తులు కొత్తకొండ నాగరాజు, ఆమెపు శ్రీకాంత్, పచ్చిమట్ల కుమారస్వామి, కొలిపాక నాగరాజు, వైనాల సుభాష్, పచ్చిమట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో గట్లకానిపర్తి వాసుల సంకీర్తన



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలోని శ్రీరామదాసు భజన మండలి వేంకటేశ్వర ధార్మిక భజన మండలికి చెందిన 30మంది సభ్యులు ఆదివారం తిరుమలలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అఖండ హరినామ సంకీర్తనలు చేశారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు బస్వోజు శ్రీనివాస్, గుడా రాఘవేంద్ర శర్మ, దామర బుచ్చయ్య, అనంతుల శ్రీశైలం, లావణ్య, సంధ్యారాణి, సాంబయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ పనులకు భూమి పూజ



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ములకనూర్, గట్లనర్సింగాపూర్, కొప్పూర్, కొత్తపల్లి, భీమదేవరపల్లి, కొత్తకొండ గ్రామాలకు ఓపెన్ జిమ్ సెంటర్లు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం భూమి పూజ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, పొన్నాల మురళి, రాజయ్య, పూర్ణచందర్, సట్ల మధు, కాంతారావు పాల్గొన్నారు.

తపాలా సేవలతో ప్రజలకు లబ్ధి

శాయంపేట : తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలతో ప్రజలకు లబ్ధిచేకూరుతుందని అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనంతరాయ్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 30న మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో పోస్ట్ ఆఫీస్ సేవలపై అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ లాభాలను చేకూర్చే పోస్ట్ ఆఫీస్ బీమా పథకాలను కొనుగోలు చేసుకుని కుటుంబాలకు భరోసా కల్పించుకోవాలని సూచించారు.

పెద్దమ్మతల్లికి సొసైటీ చైర్మన్ పూజలు

ఆత్మకూరు: మండలకేంద్రంలో పెద్దమ్మతల్లికి సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవిందర్‌గౌడ్ ఆదివారం పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు మంచిగా పండాలని రైతులు సుఖశాంతులతో ఉండాలని పూజలు చేశానని అన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

వరంగల్ చౌరస్తా : తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి ఉద్యమ నాయకుడు సోమ రామ్మూర్తి కోరారు. ఆదివారం వరంగల్ అండర్‌బ్రిడ్జి ఓంకార్ భవన్ ఎదుట తెలంగాణ ఆకాంక్షల వేదిక వరంగల్ అర్బన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా యుద్ధనౌక గద్దర్, ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్ ప్రథమ వర్ధంతి, చుండూరు అమర వీరుల 33వ వర్ధంతి సంస్మరణ సభ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు.

నడవాలంటే నరకమే..



పంగిడిపల్లి మార్గంలో ఏర్పడ్డ భారీ గుంతలు



బురదతో నిండిపోయిన పంగిడిపల్లి మార్గం

- బురదమయంగా కమలాపూర్ పంగిడిపల్లి రోడ్డు
- భారీ వాహనాలతో దెబ్బతింటున్న రహదారి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

కమలాపూర్: ఇది కమలాపూర్ నుంచి పంగిడిపల్లికి వెళ్లే రహదారి. ఈ రెండు గ్రామాల మధ్యలో తెలంగాణలోనే రెండోదైన హెచ్‌పీసీఎల్ గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ ఉంది. ఈ గ్యాస్ ప్లాంట్‌కు నిత్యం వందలాది గ్యాస్ లారీలు, భారీ గ్యాస్ ట్యాంకర్లు వచ్చిపోతుంటాయి. గ్యాస్ ప్లాంట్‌కు వచ్చి పోయే భారీ వాహనాల సామర్థ్యానికి అనుగుణంగా ప్రత్యేక రోడ్డు నిర్మించుకోవాల్సి ఉన్నప్పటికీ గతంలో వేసిన పంగిడిపల్లి రోడ్డు మార్గం నుంచే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో భారీ వాహనాల సామర్థ్యాన్ని తట్టుకోలేక కమలాపూర్ నుంచి గ్యాస్ ప్లాంట్ వరకు ఉన్న రోడ్డంతా ధ్వంసమై పెద్ద గుంతలు ఏర్పడటంతోపాటు బురదమయమై ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రెండు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆందోళన చేస్తేనే తాత్కాలిక మరమ్మతులు..

కమలాపూర్ నుంచి వెళ్లే ఈ రోడ్డుపై మోకాలి లోతులో గుంతలు ఏర్పడ్డ్ వర్షం కురిస్తే చాలు నీరంతా గుంతల్లో చేరి రోడ్డంతా బురదమయమై అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఇది భరించలేని స్థానికులు విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్లాంట్ నిర్వాహకులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో పలు మార్లు ఆందోళనలకు దిగి గ్యాస్ లారీలు, ట్యాంకర్లను అడ్డుకున్నారు. చివరకు గ్యాస్ ప్లాంట్ నిర్వాహకులు దిగివచ్చి డస్ట్, కంకర, మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ కొద్ది రోజులకే మళ్లీ రోడ్డంతా దెబ్బతింటోంది. ఇటీవల వారం రోజుల పాటు వరుసగా కురిసిన వర్షాలకు రోడ్డంతా గుంతలు పడి బురదమయమై అధ్వానంగా మారింది. ఇప్పటికే పలువురు వాహనదారులు ఆ గుంతలు, బురదలో పడిపోయి గాయాల పాలయ్యారు.

రోడ్డంతా అధ్వానంగా మారింది



కమలాపూర్ నుంచి పంగిడిపల్లికి వెళ్లే రోడ్డంతా దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడి బురదతో నిండిపోయింది. ఈ మార్గంలో హెచ్‌పీసీఎల్ గ్యాస్ ప్లాంట్ వరకు అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేదు. వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

– పుల్ల వినోద్‌కుమార్, కమలాపూర్

శాశ్వత సీసీ రోడ్డు నిర్మించాలి



రోడ్డంతా దెబ్బతిని బురద అయినప్పుడల్లా మాకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎవరికి చెప్పినా పట్టించుకుంటలేరు. గ్యాస్ లారీలు ఆపి ఆందోళన చేస్తే తాత్కాలిక మరమ్మతులు చేత్తాండ్లు. కొద్ది రోజులకే పరిస్థితి మళ్లీ మొదటికత్తాంది. గ్యాస్ ప్లాంట్ దాకా శాశ్వత సీసీ రోడ్డు నిర్మించాలి.

– బాస్పొటి వీరేశం, పంగిడిపల్లి

అత్యవసర వైద్యానికి దూరం



గ్యాస్ ప్లాంట్‌కు వచ్చిపోయే భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసమైపోతుండడంతో అత్యవసర వైద్య సేవల సమయంలో ఇబ్బంది అవుతుంది. అత్యవసర సమయాల్లో ఈ మార్గం గుండా 108, 102 అంబులెన్స్‌లు పంగిడిపల్లికి రావడం లేదు. రాత్రి వేళలోనైతే అనేక ఇబ్బందులు తప్పడంలేదు.

–కె.వసంతరావు, పంగిడిపల్లి

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన 56మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆదివారం పంపిణీ చేసి, మాట్లాడారు. పేదలసంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా నేరుగా సాయం అందిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమపథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ మార్క సుమలత, మాజీ జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, నాయకులు పర్వతగిరి రాజు, పరికిరాల వాసు, బయ్య కుమారస్వామి, రేవూరి జయపాల్‌రెడ్డి, ముద్దం సాంబయ్య, బోరిగం స్వామి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేదలకు మేలు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

శాయంపేట : సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చికిత్స చేయించుకుని సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ చెక్కులను అందజేస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని 82మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కూడా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చెక్కులు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో చెక్కులు పెండింగ్ లేకుండా చేస్తామన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కక్ష సాధింపు చర్యలు లేకుండా కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తులపై తన సంతకం కోసం తిరగాల్సిన అవసరంలేదని తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తే కార్యాలయ సిబ్బంది తన సంతకాలు తీసుకుంటారని అన్నారు. అత్యవసర వైద్య చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రిలో ఎల్ఓసీ కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 4వేల ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ సంక్షేమ పథకాలు అందజేస్తూ, ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటిన వేతనాలు అందజేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

పద్మశాలి కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలి

శాయంపేట మండల కేంద్రంలో పద్మశాలి జనాభా 70శాతం ఉందని పద్మశాలి కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని మాజీ సర్పంచ్ బాసాని శాంతరవి, నాయకులు పసునూటి రమేశ్ తదితరులు.. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు బాసని శాంతరవి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, అబ్బు ప్రకాశ్ రెడ్డి, బాసాని మార్కండేయ, చింతల రవిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలి



విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న శివ

కమలాపూర్: మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన బీసీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలని డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ డిమాండ్ చేశారు. డీఎస్ఏ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన కమలాపూర్‌లోని బీసీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమలాపూర్‌లో సుమారు 25ఏళ్ల క్రితం నిర్మించిన బీసీ హాస్టల్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరి చిన్న వర్షాలకే కురుస్తోందన్నారు. హాస్టల్ గదుల్లో గోడల వెంట నీళ్లు కురుస్తున్నాయని, భవనం పెచ్చులు ఎప్పుడు ఊడిపడుతాయో తెలియని దుస్థితి నెలకొందన్నారు. గతంలో పెచ్చులు ఊడి పడితే నాసిరకంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా నూతన భవనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ నాయకులు నాగరాజు, సురేందర్, అఖిలేష్, సిద్ధూ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హేమంత్

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం వంగర క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన బీమారం రమేశ్–గౌతమి దంపతులు తన కుమారుడు హేమంత్‌ని తీసుకొని తన ద్విచక్ర వాహనంపై హనుమకొండలోని తన బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో వంగర క్రాస్‌రోడ్డ వద్ద వెనుకనే వస్తున్న ఓ పాల వ్యాన్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న గౌతమి, రమేశ్, హేమంత్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. హేమంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రీస్తు బోధనలతో సమసమాజ స్థాపన



సిల్వర్‌జూబ్లీ వేడుకలో మాట్లాడుతున్న ఫాదర్ తాటికొండ జోసెఫ్

కాజీపేట రూరల్ : ఏసుక్రీస్తు బోధనలతో సమసమాజ స్థాపన నిర్మాణానికి ఆయన చూపిన మార్గంలో పయనించేందుకు అందరం కృషి చేయాలని ఫాతిమా పాస్టల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తాటికొండ జోసెఫ్ అన్నారు. కాజీపేట వెంకటాద్రినగర్‌లోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలు పాస్టర్ కె.పీటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జోసెఫ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజలు కోపం, పగ విడనాడి ఒకరిపట్ల ఒకరు ప్రేమతో జీవిస్తూ దేవునియందు జీవితాలను ఆధునీకీకరణ చేసుకోవాలని ఆయన అన్నారు. చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కె.పీటర్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరిస్తూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి చేయూతనివ్వాలని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రాజు, ఆనందరావు, సిహెచ్.రవి, గాబ్రియల్, ఇమ్మాన్యుయేల్, చర్చి డెలిగేట్ పి.సంపత్‌కుమార్, రాజేష్, విద్యాసాగర్, సునిల్, చర్చి కమిటీ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పందించని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు లేకపోవటంతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్‌లను నియమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన ఊరు – మన బడి పథకం కింద పాఠశాలల్లో ప్రారంభమైనా పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కేజీబీవీల్లోని టీచర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి, జిల్లా జనరల్ సెక్రటరీ గొడిశాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, గొడిశాల రమేష్, జిల్లా కార్యదర్శులు అన్నారెడ్డి, రమేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్ భాస్కర్, బాధ్యులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్కతుర్తి: కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



వేలేరు(ధర్మసాగర్): నారాయణగిరి ప్రభుత్వ పాఠశాలలో..

ఎల్కతుర్తి: మండలంలోని జీల్గుల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 1995–96 బ్యాంచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు విద్యాసాగర్‌రెడ్డి (హెచ్‌ఎం) ఉపాధ్యాయులు పశుపతిరావు, సత్యనారాయణ, రాజ్ మహ్మద్, మల్లయ్య, బాబు, స్వామి తదితరులను సత్కరించారు. రోజంతా సంతోషంగా గడిపారు. సంపక్తి భోజనం చేశారు. స్నేహితులు, నాటి ఉపాధ్యాయులతో కలిసి ఫొటోలు దిగి జ్ఞాపకాలను పదిలపరుచుకున్నారు.

నారాయణగిరి ప్రభుత్వ పాఠశాలలో..

వేలేరు(ధర్మసాగర్): ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి ప్రభుత్వ పాఠశాలలో 1980–81లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. దాదాపు 43సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల వలనే తాము ఈస్థాయిలో ఉన్నామని కొనియాడారు. అనంతరం గురువులు రాధాకిషన్‌రావు, నర్సిహారెడ్డి, జనార్దన్, జ్యోతిలను శాలువాలు కప్పి, మెమోంటోలు అందజేసి సన్మానించారు.

'రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి'

శాయంపేట : బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం రమేశ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మొగిలి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వివిధ గ్రామాల్లో మృతి చెందిన పార్టీ సభ్యులకు నివాళులర్పించారు. అనంతరం మొగిలి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజల నిర్ణయమే తలమానికమని ప్రజలకు చేరువగ పార్టీ పని చేస్తుందన్నారు. 10ఏళ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అదే తరహాలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను బడ్జెట్‌లో పెట్టలేదని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ శాతం పెరిగిందని.. అదే స్ఫూర్తితో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్, సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు బాసాని విద్యాసాగర్, రాజశేఖర్, నవీన్, సుమన్, రమణా రెడ్డి, సాంబయ్య, సుధాకర్, రాజు, తిరుపతి, శ్రీను, రాకేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో కాషాయం జెండా ఎగురవేయాలి

- కోమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌గోపాల్‌రెడ్డి

ఎల్కతుర్తి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయం (బీజేపీ) జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి కార్యర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ఆయన ముఖ్యతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తన కుర్చీని కాపాడుకోవడానికే సరిపోతుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీ తరపున నుంచి పోటీచేసే అభ్యర్థుల గెలుపుకోసం ఇప్పటి నుంచే గ్రామాల్లో తిరిగి విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. భీమదేవరపల్లి మండలంలో 50పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసే వరకు విడతల వారీగా పోరాటం సాగించాలని దిశానిర్దేశం చేశారు. జన్నపు రెడ్డి సురేందర్‌రెడ్డి, కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పృథ్వీరాజ్, కిషన్, శ్రీనివాస్, సదానందం, అశోక్‌రావు, రవీందర్, వేణు, కవిత, రాజు, ప్రసాద్, రాణా, ప్రతాప్, మహేష్, వికాస్ పాల్గొన్నారు.

దామెర: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నల్గొండ పార్లమెంటరీ ప్రభారి చాడా శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ల్యాదెళ్లలో మండల పార్టీ అధ్యక్షుడు జంగిలి నాగరాజు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామపంచాయతీకి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అవుతున్నట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తున్నామని, సాంకేతిక లోపాలు లేకుండా రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో బీజేపీ బలంగా ఉందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయచందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంద ఐలయ్య, సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నాయకులు వీసం రమణారెడ్డి, జంగిలి నాగరాజు, రాజ్‌కుమార్, మధుకర్, సుధాకర్, చంద్రకిరణ్ పాల్గొన్నారు.

కాశిబుగ్గలో మైసమ్మ బోనాలు



వరంగల్: కాశిబుగ్గ శ్రీవివేకానందపురి వీధిలో ఆషాఢమాస మైసమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులు, బోనాలతో వీధిలోని మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహానికి విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సముద్రాల రాములమ్మ, గోసికొండ శాంతమ్మ, విజయ, భాగ్యలక్ష్మి, రమ, జ్యోతి, డాక్టర్ మహిత, స్వాతి, జయ, లలిత తదితరులు పాల్గొన్నారు.